# లక్ష్మి

శ్రీ ఆకెళ్ల సీతారామంగారు

అది మధ్యాహ్నము. ప్రభాకరుని తీక్ష్ణ కిరణముల ధాటి కాగజాలక పక్షులన్నియు తమతమ గూండ్ల నక్కియున్నవి. పశుశాలలనుండి ఆవులు, లేగలు దాహముచే గొంతులెత్తి 'అంబా' అని యఱచుచున్నవి. వీధులన్నియు నిర్మానుష్యములై నిశ్శబ్దముగనున్నవి. అట్టితఱి నొక్క యువతీలలామ తన మృదుపదంబులు కందునని భయ మొక్కించుకయు లేక జివ్వున దవ్వననే యున్న బావికేగి చల్లని మంచినీటిని దెచ్చి మగిడిగృహంబు జేరెను.

శ్యామలుడు రూపసి. విద్యావంతుడు. ఇతడు ఏం.ఏ. పరీక్షయందుత్తీర్ణుడయ్యెను. తొలుత భాగ్యవంతుడేయైనను విద్యాభ్యాసమునకై ధనమంతయు వెచ్చించుటచే నిప్పుడు నిరుపేదయయినాడు. తల్లిదండ్రుల కేకపుత్రుడగుటచేతను, స్థితిగతులు బాగుండుటచేతను మోహనరావుగారు తమ ప్రియసుత లక్ష్మి నిచ్చి పెండ్లిచేసిరి. మంచి నీటికై యెండలో బావి కేగివచ్చిన పల్లవగాత్రి లక్ష్మియే.

లక్ష్మి-శ్యామలులు గుంటూరునం దొకయింటిని బాడుగకు దీసికొని అందు గాపురముండిరి. పిత్రీయమంతయు ఖర్చగుటచే భార్య యొడలిపైనున్న రెండువేల రూప్యముల నగలతో నా దంపతులు గడపుచుండిరి.

అంతవిద్యనభ్యసించియు నేదయిన నుద్యోగము సంపాదించుట కడుదుర్ఘటముగానున్నది. అయినను శ్యామలుడు ప్రయత్నము మానలేదు. పవలంతయు నెందెందో కాలముగడపి రాత్రి యగుసరికి గృహము జేరుచుండును. అనుకూలవతియు, సుగుణవతియు, సౌందర్యవతియు, నర్ధాంగియునగు లక్ష్మి, భర్తకు నెంతయు దన యమృతమయ వాక్కులచే నాహ్లాద మొనర్చుచుండెను. పాప మామెమాత్ర మేమి చేయగలదు? ఉద్యోగమునకై తన భర్త పడుచున్న ప్రయాసములు వృథాయగుచున్నవి. కాలము మారిపోయెను. ఆమెయొడలిపైనున్న నగలుమాత్ర మెంతకాలముండును? అవియు నొకదానిపై నొకటి మార్వాడీల వశమయ్యెను. వ్యవసాయవృత్తి చేయుదమన్న గోష్పాదమంత భూమియుగూడ లేదు.

శ్యామలుడు తనలోదా నిట్లు తలపోయ మొదలిడినాడు. "కాల మీ తీరున మారునని ముందే తెలిసియుండినచో నీ పాడు హూణవిద్య నభ్యసింపకయే యుందునే! మామగారియింటి కేగుదమా యన్న, అల్లున కత్తవారింట మెలగుటకన్న చౌకదన మింకొకటిలేదే. ఏమయినను యిట్టితఱి ధైర్యమును వహించి వేరొకయూర వంటలవాడుగానైన గుదురుట యుత్తమము."

మరునాడు లక్ష్మీ శ్యామలులు బెజవాడ చేరినారు. శ్యామలుడు తిన్నగా నొక భోజనహోటలునకేగి దాని యజమానితో సంభాషించి తన్నా హోటలునందు వంటల వాడుగా నియోగించున ట్లా యజమాని నొప్పించినాడు. శ్యామలు డొక యింట బస కుదుర్చుకొని, అందు తన భార్యనుంచి హోటలునందు పనులన్నియు ముగిసినపిదప లక్ష్మివద్ద కేగుచుండువాడు. హోటలు యజమాని యొకనాడు శ్యామలునితో "శ్యామలా, నీ కిచ్చు స్వల్పజీతములో మఱల వేఱొక గృహమును బాడుగకు తీసు కొంటివి. అట్లుగాక నీ భార్యతోగూడ నీవు మా యింటనుండుట యుక్త"మని చెప్పెను. మఱియు నామెకూడ నచ్చట బనిచేసినచో కొన్ని రూకలను బడయగలదని వాక్రుచ్చెను. ఆత డిదివఱకు నెచ్చట బనిచేయుచుండెనో, యెట్లు జీవయాత్రను సాగింపగల్గుచుండెనో లక్ష్మి కిసుమంతయుజెప్పలేదు. కాని యిప్పు డామె కీ సంగతి దెలియబఱచి యామెకూడ వంటకత్తెగానుండుట కొప్పించెను. యజమా నియు లక్ష్మిసౌందర్యమున కెంతయు డెంద మున మహదానందమునందుచు, నామెకు దటస్థించిన దురవస్థకు లోలోనం గుందుచు దంపతుల నతిదాక్షిణ్యముతో జూచుచుం డెను.

కొంతకాలమునకు లక్ష్మి తండ్రి మోహనరావుగారు నేదో పనిమీద బెజ వాడ వచ్చి మన లక్ష్మీ-శ్యామలులున్న హోటలునకే భోజనమునకేతెంచిరి. మోహనరావుగారు ప్రఖ్యాతివడసిన న్యాయ వాదులగుటచే హోటలుయజమానికూడ వారిని సన్మానించి వంట లవనున్నవనియును, వంటవాం డ్రతినిపుణులనియును జెప్పి వారితో ముచ్చటింపజొచ్చెను. ఇంతలో వంటలు తయారైనవనియు, వడ్డన జరుగు చున్నదనియు వినబడినకేకకు మోహన రావుగారు వడ్డనశాల జేరిరి. వా రచ్చట గాంచిన దృశ్యమునకు నిశ్చేష్టులై యిది కలయా నిక్కువమా అని, తన్నుజూచి సిగ్గున దలవంచుకొన్న ముద్దులపట్టియు, శృంగారగాత్రియు, పూర్ణేందువదనయునగు లక్ష్మి నొక్కమారు దగ్గరకు చేరంబిలిచి కౌగిటనొత్తి యామె దుస్థితి కెంతయు బరి తపించెను. మఱియు కార్యనిమగ్నుడై యున్న శ్యామలుని జూచి 'చదువుకున్నందు లకు ఫలితమిదియా' అని లోలోన గుందుచు కొంతసే పట్లే నిశ్చేతనుడయ్యెను.

తదుపరి లక్ష్మి-శ్యామలులను వెంట బెట్టుకొని తన నిజపురంబున కేగి భార్యకు వారి దుస్థితినిగూర్చి తెలియజేసెను. అనతి కాలముననే జామాతశ్యామలునకు మంచి యుద్యోగము నిప్పించి యెప్పటియట్లు దంప తుల నానందాబ్ధి నోలలాడించెను. కొలది కాలములోనే లక్ష్మి, శృంగారగాత్రు డు, తేజోవంతుడు, గుణవంతుడు నగు సుపుత్రుని గాంచెను. అట్లు లక్ష్మి-శ్యామలు లెల్లపుడును పరస్పరము ప్రేమించుకొనుచు సుఖముగనుండిరి.